# సీత

రచన:
శ్రీ ఇందల లింగమూర్తి.

'సీతా...!'

'ఆఁ...'

'నీ పండ్ల దుకాణాన్ని, ఏం చేసినా చేయగలను తెలుసా...?'

'తెలుసు...'

'మరి నేనడిగిన సంగతి ఏం చేశావు...'

'ఏమిటది...?'

'మరచిపోయావా! అదే మొన్న అడిగాను కదూ...?'

చిరునవ్వు నవ్వింది. పరశురాం, పోలీసు దుస్తుల్లో, ఆమెకు ఓ పెద్ద సూపర్ింటెండెంటులా కనిపించాడు. ఆమె చెక్కు చెదరని పుక్కు మనిషి! ఇరవై అయిదు సంవత్సరాల వయసు వుంటుంది. అంత పెద్ద అందగత్తె కాకపోయినా, కొనితలో కొంత 'రూపసే' అని చెప్పొచ్చు.

పరశురాంకు నాలుగు రోడ్లు కలిసే గంట స్తంభం సెంటర్లో ప్రతీ రోజూ పగలు డ్యూటీ వుండేది! రోడ్డుకు ఓ వేపుగా సీత చిన్న పండ్ల దుకాణం పెట్టుకొని రోజుల్ని గడుపుతూ వుంది. డ్యూటీమీదున్న పరశురాం-ఆమెను రోజూ అదోకమో స్తరుగా చూస్తూ వుండేవాడు. ఆమెకూడా అతన్ననుసరిస్తూ వుండేది.

'నామాటకు బదులు చెప్పవేం...?'

పరశురాం మాట్లాడుతున్నకొద్దీ, ఎదురుగా వున్న కిళ్ళీ కొట్టువాడు లొట్టలువేస్తూ చూసేవాడు.

'ఇప్పుడు కాదండీ! రేపు చెపుతాను...'

'కాదు ఏదో వొకటి తేల్చి చెప్పరాదూ?'

'చూద్దాంలెండి! ఏమంత తొందర...?'

ట్రాఫిక్ మధ్య నిలబడి ఆనాడు, వచ్చే బండికీ, పోయే బండికీ సిగ్నలు యిస్తున్నాడు పరశురాం. ఇంకా సీత దుకాణం తెరవలేదు.

కిళ్ళీ దుకాణంవాడూ-సైకిల్ షాపువాడూ, పరశురాం వేపు కోపంతో చూస్తున్నారు. వచ్చే పోయే అడ వాళ్ళను వాళ్ళు గేలిచేసేట్లు పరశురాం చేయడు. వాళ్ళేదో రాడీజం వెలగబెట్టాలనుకుంటూరు కాని నోటి దురదతప్ప ఇంకొకటిలేదు వాళ్ళకి!

'అరే! రిక్షా!...ఏం కనిపించడం లేదూ? అంత పొగరా...? ఏదీ నెంబరు టిళ్ళ...!'

'ఏయ్ బండీవాలా...ఆపు! లైసెన్సు కట్టలేదేం?'

సీత రోడ్డుకు ఓ ప్రక్కన దుకాణం పెడుతూవుంది. పరశురాంకి మతిపోయింది. చాపినచెయ్యి చాపినట్లే వుంది. కార్లన్నీ నిలబడిపోయినయ్! బళ్ళన్నీ ఆగినయ్! పోనీ రెండవ ప్రక్కనుంచి బళ్ళు వస్తున్నయ్యా అంటే అదీలేదు. పరశురాం చూపులన్నీ సీతమీదనే వున్నయ్! అతనికి ఈలోకంలో ఏంజరుగుతూందో తెలియడంలేదు. పోకిరీ వెధవలు...కిళ్ళీ కొట్టువాడు, సైకిలు దుకాణం వాడూ యిద్దరూ ఒక్కసారి చప్పట్లుకొట్టి, ఈలలు వేశారు. అదరిపడి చూసేటప్పటికి కార్లూ, బండ్లూ, రిక్షాలు, జట్కాలు ఎక్కడివక్కడ నిలబడివున్నయ్! చెయ్యి దించాడు. ప్రక్కనుంచి పోతున్న కారులోంచి ఓ పెద్ద మనిషి అన్న 'డామిట్' అనే మాటలు విని పించినయ్.

తను 'డామిట్'...కాదు...కాదు...తనుకాదు. ఆ కారులో పోతున్నవాడే! తన తన్మయత్వాన్ని పాడు చేసి తన సుఖస్వప్నాలు నేలకూల్చిన కిళ్ళీ దుకాణం వాడూ, చాటంత నోరుగల కోతి ముఖం సైకిలు షాపు వాడూ...యిద్దరూ...'డామిట్'...లే.

సీత అందచందాల్నీ, ఆమె చిరునవ్వునీ అనుభవించ లేక, దానితో ఎన్నోసార్లు తిట్లుతినికూడా వీళ్ళకు బుద్ధి రాలేదు. తను ఆమె మనసును కనిపెట్టి, ఎంతో వినయంగా లోబరుచుకుని, మాటల్లోకి దించాడు. తియ్యని పండ్లు సీత తనకిస్తుంటే గ్రుడ్లు మిటకరించుకుని చూస్తున్న ఎదుటి కొట్టువాడికి నోట్లో నీరూరింది. డ్యూటీనుంచి దిగిపోవటంతోనే ఆమె దుకాణంముందుకు వచ్చి నిలుచున్నాడు. సీత అతన్ని క్రీగంట చూసింది. ఎదుటి కొట్టువాళ్లు అల్లరి చేసేందుకు తయారయారు.

వెధవల్ని పట్టుకుని వెళ్ళి స్టేషనులో నాలుగు తంతే బాగుండేది. ఇంతలోకే యింకొక కానిస్టేబులు శివరావు సీత దుకాణం దగ్గరకువచ్చి 'ఇదేం రోడ్డనుకున్నావా, లేక నీయబ్బగాడి స్థలమనుకున్నావా?' అని బెదరించాడు.

కొదురు చూపులు చూసింది సీత,

'ఏం శివరావ్! ఇప్పుడు డ్యూటీలో వుంది నేనా... నువ్వా? నాకులేని అధికారం నీకెక్కణ్నుంచి వచ్చింది. నీపని నువు చూసుకో' అని పరశురాం గదిమాడు.

'డ్యూటీయా' చూద్దాం అదెంతకాలమో.'

నాలుగు పండ్లుతీసి శివరావుకి యిస్తూ... 'కనికరించాలి బాబూ! ఎందుకంతకోపం' అంది సీత జాలిగా.

వీడు కనికరించాలా...మరి నేనో......

పరశురాం యిన్నిరోజులనుంచీ తను కంటున్న కల లన్నీ మాయమవుతూ, నేలకూలినట్లయినయ్.

శివరావువేపు ఆమె చూసిన చూపులు పరశురాం హృదయంమీద పెద్దగా సమ్మెటలతో కొట్టినయ్! తెంగపట్టుకుంది ఏడ్పుపర్యంతం అయింది.

అయిదారు రోజులు గడిచాయ్! ప్రతిరోజూ శివరావ్ రావడం కొన్ని పండ్లు తీసుకు వెళ్ళడం జరుగుతూనే వుంది. పిట్టను ఎగరకొట్టుకొని వెళ్ళేటట్లున్నాడు.

పరశురాంకు విశాఖపట్నం బదిలీ అయింది. అతని డ్యూటీమీదకు శివరావువచ్చాడు. విశాఖపట్నం వెళ్ళబోతూ పరశురాం సీతతో "చూడుసీతా! ప్రపంచమంతా మోసంతో నిండిపోయింది. ఎవరి స్వార్థం వాళ్ళదే. ఒకరి బాగోగులు, ఒకరికి పట్టవు. నాకు విశాఖపట్నం బదిలీ అయింది. నువ్వుకూడా అక్కడికి వచ్చావంటే, నీ కింతకంటే పెద్ద దుకాణం పెట్టిస్తాను. ఏమంటావు...? వస్తావా?" అని అడిగాడు.

"బదిలీ అయిందా? అయితే నన్నూ యిక్కణ్నించి బదిలీ రమ్మంటున్నారా?" ఆమె కళ్లు మెరిసినయ్ ఆ పెదాలమీద మెల్లిగా నవ్వు దొర్లుకు పోయింది.

"అవును—"

"ఎందుకులెండి, నే నిక్కడే వుండిపోతాను."

"కాదు నామాటవిను! నువ్విక్కడుంటే నా మనస్సెంతో బాధపడుతుంది. నువ్వి కనపడకపోతే నాకేమి తోచదు. నామాటవిను" తన ప్రేమను, వాంఛను, మాటలద్వారా అంతకంటే ఎక్కువగా చెప్ప లేక పోయాడు.

"నేను రానంటూ వుంటే బతిమాలడం దేనికి? మీ దారిన మీరు వెళ్లండి!" అంది సీత కటువుగా.

పిడుగు పడినట్లయింది. తనెన్నో కోర్కెలు పెట్టుకుని ప్రేమించిన సీత, తనెంతో కాలంనుంచీ ఆశించిన సీత,..' ఈ విధంగా మారిపోయిందేమిటి?

"నిజమేనా...?"

సీత మాట్లాడకుండా తల వంచుకుంది.

"సరే, ఇంతకాలం నుంచీ నువ్వు నాకిచ్చిన పళ్ళకు అయిన డబ్బు తీసుకుని మిగతా చిల్లర యివ్వు! ఒకరి వస్తువులు వూరికే తినే కానిస్టేబులు శివరావ్ లాంటి రకాన్ని కాదు" అని పదిరూపాయల కాగితాన్ని విసిరేశాడు.

"వద్దండీ! మీరే తీసుకుని వెళ్ళండి"

"చూడు సీతా! నువ్వు అమాయకు రాలివి నీ కేమీ తెలియదు. ప్రపంచంలోని మాయమర్మాలు తెలుసుకునేంత వయసులేదు. జ్ఞాపకముంచుకో! నా మాటలు యిప్పుడంత గొప్పగా లేకపోయినా ఎప్పుడో ఒకనాటి కన్నా యివి నీకు సరైన సమాధానాన్ని చూపిస్తాయ్. ఆపదకాలంలో నిన్ను తప్పకుండా ఆదరిస్తాను. గుర్తుంచుకో" అని చిల్లర పైకానికి ఎదురుచూడకుండానే చరచరా వెళ్ళిపోయాడు.

పకపక నవ్వాడు మళ్ళీ దుకాణం మనిషి!

గుర్రంలా సకిలించాడు సైకిల్ షాపువాడు!

తన ప్రత్యర్థి నిరాశతో వెళ్ళిపోయినందుకు సంతోషించాడు డ్యూటీ మీదనున్న శివరావు.

* * *

అచ్చయిన ఐదు క్యాలండర్లు ఆనందంగా మారిపోయినయ్. ఈ మధ్యలో ఎన్నో మార్పులు జరిగాయ్! పరశురాం ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఇనస్పెక్టరు పదవి అధిష్టించాడు. ఇప్పుడు 'ఏ రిక్షా! ఆగు' అని అరవవలసిన పనిలేదు. తనకు ఒక అంగరక్షకుణ్ని గవర్నమెంటు ప్రసాదించింది. పైగా పెళ్ళి పెడాకులు కూడా లేవు. హోటలు మెతుకులు, మఠం నిద్ర!

పరశురాం కిప్పుడు కావాలంటే పదిమంది సీతలు రాగలరు. "ఏమంటావు" అని అడగడమే తరువాయి! అతనికి ఎదురీత గలవాళ్ళెవరూ లేరు.

సీతను తలంచుకోవడంతోనే, అదేదో మత్తు శరీరంలో వ్యాపించింది. మనసు తిరిగి పోలీసు పనిలోకి పరుగు తీసింది. అక్కడతను వున్న నాలుగు సంవత్సరాలు

సీతతో ఆనందంగా కాలం గడిపాడు. తియ్యని పళ్లూ, కమ్మని మాటలు, ఎన్నో చవిచూశాడు. తిట్లు తిన్నాడు కూడా! వెధవ పోలీసు ఉద్యోగం లేనట్లయితే, యిరవై నాలుగు గంటలూ సీతతో కబుర్లు చెబుతూ ఆమెకు ఎదురుగా కూర్చునేవాడే.

* * *

చిన్నతనం గుర్తుకు వచ్చింది. తనతండ్రి తనను సర్కిల్ యింటికి తీసుకుని వెళ్ళడం, అక్కడతను పోలీసు వుద్యోగంలో చేసినచేష్టలు ఎంతో వింతగా తలపుకు వచ్చాయ్! అక్కడ సర్కిల్ కూతురు తనను చూసి చిరునవ్వు నవ్వి, పైట సర్దుకోవడం, ఒకనాడు బజారు నుండి కూరలు యిచ్చేందుకు, వారింటికి వెళ్ళినప్పుడు గాటిని పుచ్చుకుంటూ తనను ముట్టుకుని చూసి 'అందగాడివి!' అని అనడం, చిలిపిగా చూడడం, తననేదో లోకంలోకి లాక్కుపోయినట్లయేది. ఒకరోజు యింట్లో ఎవరూ లేని సమయం చూసి తనను ముద్దు పెట్టుకోవడం, అంతలో చప్పుడు కావడంతో నే బయటికి నెట్టేయడం గుర్తుకొచ్చేటప్పటికి శరీరం పులకరించింది. పరశురాం తనలో వ్యాపించిన విద్యుత్ ప్రవాహాన్ని అరికట్టేందుకు ప్రయత్నించాడు. కానీ కృతకృత్యుడు కాలేకపోయాడు.

సాయంత్రం అయిదుగంటలవుతుంది. అతను సీత రూపాన్ని తలచుకుంటూబయలుదేరాడు. ఆమె అందం. భగవంతుడు 'స్త్రీ' కింత అందం ఎందుకిస్తుంటాడు? కోర్కెలు లేని మనస్సుల్లో విద్యుత్ శక్తి ప్రసరింపచేసేందుకింత ప్రయత్నమెందుకు? అందమనేది క్షణికమైనప్పటికీ, మనసును యింతబలంగా ఎందుకని ఆకర్షిస్తూ వుంటుంది? గులాబీ పువ్వు... రెండురోజుల్లో వాడిపోయి పనికిరాకుండా పోతుందే! దానికింత కోమలత్వం సౌందర్యమూ, పరిమళమూ ఎందుకని కలిగించాడు? అవి వుండబట్టే అంత త్వరగా నాశనమౌతోందేమో?

భావనా ప్రపంచంలో మునిగితేల్తున్న అతని చూపులు అకస్మాత్తుగా ఒకామెమీద పడినయ్. ఇక్కడికి వచ్చిన అయిదు సంవత్సరాల్లోనూ, పరశురాం ఆమెను ఇక్కడ ఎప్పుడూ చూడలేదు. అలాంటి అందమూ, యవ్వనమూ, అతనింతవరకూ చూడలేదు. ఆమె రూపం చూస్తున్నంతసేపూ, కాళ్లు ఎందుకనో ముందుకు సాగలేదు. అతను ఎక్కడున్నాడో, ఏమి చేస్తున్నాడో మర్చిపోయాడు. ఎవరామే? ఆమే! అదే అందం, అయితే యిక్కడికి ఎందుకు వచ్చినట్లు? ఎలా వచ్చింది? మనసంతా కల్లోలమైంది. చకచకా మెట్లెక్కి పైకివెళ్ళి ఆమెముందు నిలుచున్నాడు...

'సీతా! నువ్వా? నా కళ్ళు నిన్నే నా చూసేది'

ఆమె త్రుళ్ళిపడి చూసింది. పరిచితమైన కంఠస్వరమే.

'నువ్వా? యిక్కడకూడా నువ్వున్నావా? ఇనస్పెక్టరు అయ్యావా ఏం?'

'ఆఁ... అవును. సరేగాని నువిలా మారిపోయావేమిటి? యింతగా పతనం పొందావేమిటి...?' ఆమాటలు ఆవేదననూ, గాబరాగానూ బైటికి తెచ్చినయ్.

ఆమె కిలకిలమంటూ నవ్వి 'నువ్వెంతో గొప్పగా సంపాదిస్తూ, పోలీసునుంచి ఇనస్పెక్టరుపదవికి వచ్చావు. నేను పళ్లవ్యాపారం మానేసి, అందాన్నాధారంగా చేసుకుని వ్యాపారం చేస్తున్నాను. మొదట్లో ధూళి దూసరమైన రోడ్డుమీద వుండేదాన్ని. ఇప్పుడు అంతఃపురంలో, ముఖమల్ దిండ్లమీద కూచుంటూ, పడుకుంటున్నాను. ఆ రోజుల్లో గొంతు చించుకుని అరుస్తూ పళ్లని అమ్మేదాన్ని. ఇప్పుడు మౌనంగా కిటికీముందు కూచుని వుండడమే నాపని. పూర్వంలాగు గీసిగీసి బేరం చెయ్యాల్సిన పనిలేదు. విశాఖజిల్లా షావుకార్లంతా ఎంతో పరిచయమున్నవాళ్ళలా వచ్చి 'ఎంత'? అని అడుగుతారు. 'ఇంత' అని వేళ్ళతో చూపిస్తాను. మనసు లాగుతున్నకొద్దీ వుంటాడు. లేదా, వెళ్లిపోతాడు. పోలీసువాళ్లు కానీయండి, ఇంకా అంతకంటే పెద్ద అధికారి కానీయండి!

ఎవరికైనా ఒకే నిర్ణయం! ఇష్టపడి వున్నట్లయితే ఏ బాధాలేదు, లేనట్లయితే అంతకంటే యిబ్బందీ లేదు. బోర్డు కట్టవలసిన పనిగాని బేరం కుదరదనే దిగులుగాని లేదు. కనురెప్పలు ఆడిస్తే సరిపోతుంది... నువ్వే చెప్పు? డబ్బు సంపాదించేందుకు, ప్రాణాన్ని నిలబెట్టుకుని బతికేందుకు నాలాంటి దానికి ఇంతకంటే ఇంకోవిధమైన ఆధారమేముంది?' అన్నది.

'నువ్వు చెప్పవలసిన మాటలు చెప్పావు గాని సీతా! నీ అంతరాత్మలోంచి వచ్చిన మాటల్లా లేవు. హృదయానికి కలిగిన బాధతో ఆవేదనరూపంలో నీ మనసులోంచి

బైటపడినయ్ నాకు తెలుసు. సీత కళ్లను దించుకపోయినయ్: తలెత్తి ఆమె పరశురాంను చూడలేకపోయింది.

'నిన్నెవరో నమ్మించి పాడుచేశారని నా అంతరాత్మ చెబుతోంది. నా కంతా అర్థమయేట్లు చెప్పు సీతా! నిన్నిక్కణ్నుంచి ఏవిధంగానన్నా బైటికి లాగేందుకు ప్రయత్నిస్తాను' అన్నాడు.

సీత మాట్లాడలేదు. తలవంచుకుని ఆమె నోటికి చేతి రుమాలును అడ్డం పెట్టుకుంది. పరశురాం ఆమెవేపు ఎంతో ఆప్యాయంగా, దయగా, జాలిగా, ప్రేమగా చూశాడు. ఏదో మాట్లాడాలనుకున్నాడు కాని, అతని కంఠం రుద్ధమైంది మాటలు బైటికి రాలేకపోయినయ్.

కళ్ళంట నీళ్లు కారుస్తూ 'అతనే, ఆ శివరావ్ నన్నిక్కడికి తీసుకునివచ్చి, రెండువేలరూపాయలకి అమ్మి పారిపోయాడు.' అంది.

పరశురాం మీసం మెలిపెట్టి 'నామాట వింటావా?' అన్నాడు.

'చెప్పండి.'

'నే నెవర్నో తెలుసుకదా?'

'ఊఁ...'

'నేను ఆనాడుకూడా నీకు చెప్పాను'

'గుర్తుంది'

'ఇంకా ఏదో చెప్పాను గుర్తుందా?'

'లేదు—'

'నేను నీకు వాగ్దానం చేశాను'

'ఏమని...'

'నువు ఆపదల్లో పడినపుడు, నీకు దిక్కులేనపుడు, సహాయం చేస్తానని, నీ కోసం ఎదురుచూస్తుంటానని'

'సరి—?'

'మరేముంది?'

'కానీ, మీరు ఉద్యోగస్తులు. నేను వ్యాపారిని, వ్యాపారికీ, ఉద్యోగస్తులకీ సంబంధం ఎలా కుదురుతుందని ఒకరోజున చెప్పాను'

'అవును, నువ్వన్నమాటలు నా చెవుల్లో యింకా రోదనచేస్తూనే వున్నాయి. అయితే'

'ఏమీలేదు. నే నిప్పుడుకూడా అందాన్నాధారంగా చేసుకుని వ్యాపారంమీద బతుకుతున్నాను. మీరుకూడా ఇప్పటికీ అధికారపదవిలో ఉన్నారు. అటువంటి పరిస్థితుల్లో మనకు సంబంధమెలా కలుగుతుంది.'

ఆమె మాటలు పూర్తి కానేలేదు. తలుపుదగ్గర ఎవరో 'సుందరీ!...ఓ సుందరి, తలుపుతియ్' అని పిల్చారు.

ఆమె తుళ్లిపడి 'నా వ్యాపారానికి సమయమైంది ఇనస్పెక్టరుగారూ! మరి మీ అభిప్రాయమేమిటో తొందరగా చెప్పండి' అన్నది.

పరశురాం ముఖంలో ఆందోళనా, విసుగూ స్పష్టంగా కనిపిస్తున్నయ్. పెదిములు తడుపుకుంటూ 'నేనివన్నీ ఆలోచించటంలేదు సీతా! జీవితానికి సుఖమూ, ఆనందమే కావాలిగాని, వస్తువుతాలుకు పుట్టుపూర్వోత్తరాలు నాకవసరంలేదు' అన్నాడు.

అంటే నాకర్థంకావటంలేదు'

'అర్థమయేట్లు చెప్పమంటావా?'

'అర్థమయేట్లుగనే చెప్పండి?'

'నా మాటల్ని విన్నతర్వాతన్నా స్పష్టంగా అవుననో, కాదనో చెప్పాలి.'

'తొందరగా చెప్పండి'

"నన్ను వివాహం చేసుకుంటావని, ఇప్పటికీ నేను నమ్ముతూనే వున్నాను సీతా! నా హృదయం ఎందుకనో, నీపట్ల అతీతమైన అనురాగాన్ని చూపిస్తూవుంది. అందుకు నేను సిద్ధంగా వున్నాను. ఏమంటావు?" అన్నాడు.

"అలా అనకండి" అని చేతో అతని నోరు మూసి "చాలు, ఆమాటలే ఈ జీవితానికి చాలు. అవే నాకు తరగని వరాలు! నేనెక్కడ మీరెక్కడ? మీకూ నాకూ సమానత్వమేమిటి? సంఘం మిమ్మల్ని బహిష్కరిస్తుంది" అన్నది. ఆమె చేతిని నెట్టి "అనవసరమైన ఈ మాటల్ని ఇప్పటికైనా కట్టిపెట్టు సీతా! నీ కిష్టమేనా కాదా?" అని అడిగాడు.

"కానీ నన్ను కొన్న యజమానికి రెండు వేలు ఇవ్వాలి"

"ఆ విషయం నేను చూచుకొంటాను."

తలుపు బైట నిలుచున్న మనిషి "అప్పుడే కొమ్మలు మొలిచినట్లున్నాయే!" అని రెండో మనిషితో ఏదో గొణిగినట్లు వినిపించాయి.

బైట వున్న ఇంకో మనిషి గట్టిగా "సుందరీ తలుపు తెరుస్తావా, లేదా?" అని అరిచాడు.

సీతకు ఆ మాటలు వినిలేదు. ఆమె పరశురాం కళ్ళల్లోకి చూస్తూ "ఇనస్పెక్టరుగారూ మీరు భగవంతుడిలాంటి వారు గనుకనే నేనెంతో అదృష్టవంతురాలిని. మీ కిష్టమైనట్లయితే నాకూ ఇష్టమే!" అని నిలుచుంది. తలుపు తెరిచాడు. ఏదో ఘనకార్యం చేసినట్టు, పిస్టల్ గొట్టాన్ని చూసేటప్పటికి బైటనిలుచున్న ఇద్దరి ప్రాణాలు ఎగిరిపోయి నట్లయినయ్. వెంటనే సుందరి కోసం ఎదురుచూడక వాళ్ళకు బుద్ధి చెప్పారు పావుకార్లు యిద్దరూన్ను.